www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 జనవరి 2026
5
తిరుపతి

రేపటినుంచి ఎపిపిఎస్‌సి డిపార్టుమెంటల్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 5-10 తేదీల్లో ఎపిపిఎస్‌సి కంప్యూటర్ డిపార్టుమెంటల్ పరీక్ష జరగనుందని, అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. శనివారం ఉదయం జూమ్ సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఒక పరీక్షా కేంద్రం ఉందని, 1188 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ లైజాన్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్, వైర్లెస్ హెడ్‌సెట్స్ అనుమతి ఉండదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుపతి జూపార్కు రోడ్డులో పరీక్షా కేంద్రం ఉందన్నారు.

దివ్యారామంలో..

నడిస్తే పన్ను.. కూర్చున్నా పన్ను..!

ఉదయాన్నే నిద్ర లేచి ఆహ్లాదకరంగా పచ్చనిచెట్ల మధ్య 'వాకింగ్' చేస్తూ నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పార్కులు, నగరవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.. చిన్నా పెద్దా తేడా లేకుండా యువతతో సహా దాదాపు వేలల్లో ప్రజలు 'వాకింగ్', జాగింగ్ చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకుంటూ ఉన్నారు. దివ్యారామం(నగరవనం) అయితే తిరుమల కొండ సమీపంలో ఉండడంతో అత్యంత రమణీయంగా, పక్షుల కిలకిలరావాల మధ్య 'వాకింగ్' చేయవచ్చు.. ఓ రకంగా పుర ప్రజల టెన్షన్‌ను నగరవనాలు తొలగిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.. వాకింగే కాదు, షటిల్ ఆడతారు, జిమ్ పరికరాలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తారు. అలాంటి దివ్యారామంలో 'వాకింగ్' చేయాలంటే 'వంద' రూపాయలు పన్ను కట్టి తీరాలంటూ ఫారెస్టు అధికారులు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. 'వాకింగ్' చేస్తే డబ్బు కట్టాలా అంటూ పురప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజల డబ్బులతో పార్కులను అభివృద్ధి చేసి, ప్రజల వద్ద తిరిగి నడచినా, కూర్చున్నా డబ్బులను వసూలు చేయడం ఏంటంటూ మండిపడుతున్నారు. ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవడం కూడా పాలకులకు ఇష్టం లేదా? అని వాపోతున్నారు.

- **కమర్షియల్‌గా 'నగరవనం' మార్పు**
- **వాకర్స్ వద్ద డబ్బు గుంజుతున్న ఫారెస్టు**

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎంఎల్‌ఎకు సిపిఎం జిల్లా కార్యదర్శి వినతి

సాక్షాత్తు తిరుమల కొండ సమీపంలోని ఎస్వీ నగరవనం (దివ్యారామం)లో వాకింగ్ చేయాలంటే అటవీ శాఖ అధికారులకు నెలకు 100 రూపాయల పన్ను విధిస్తున్నారు. ఇదేమని అడిగితే అటవీ శాఖ అభివృద్ధి కోసమేనని వారి సమాధానం. ఆరు నెలలకు రూ.500, ఏడాదికి రూ.1000 పద్ధతిని ప్రవేశపెట్టారు. తిరుపతిలో ఎక్కడా లేని విధంగా వాకర్స్ వద్ద డబ్బులు వసూలు చేయడంపై పురప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నగరంలో వృద్ధులు, మహిళలు, బీపీ, సుగర్ ఉన్నవారు, ఊబకాయంతో యువత వాకింగ్ చేస్తుంటారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ దాదాపు వెయ్యి మందిపైనే ఇక్కడకు వాకింగ్‌కు వస్తారు. వారం రోజులుగా (గత ఏడాది చివరి నుంచి) వాకింగ్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వద్ద రూ.100 వసూలు చేయడం ప్రారంభించారు. ప్రతిరోజూ నగరవనానికే వాకింగ్‌కు వెళ్లే సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర అభ్యంతరం తెలపడమే గాకుండా వసూళ్లు ఆపకుంటే జనవరి ఒకటో తేదీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీంతో ఆ ఒక్కరోజు మాత్రం వసూళ్లు ఆపారు. తిరిగి రెండో తేదీ నుంచి వసూళ్లు చేయడం ప్రారంభించారు. డిఆర్ఒ శ్రీనివాస్‌కు, తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులుకు 'పన్ను వసూళ్ల ఆపాలి' అంటూ వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఫారెస్టు అధికారుల్లో ఏమాత్రం చలనం రాలేదు. తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్, తుడా పరిధిలో పార్కులు ఉన్నా ఎక్కడా వాకర్ల దగ్గర డబ్బులు వసూలు చేయడం లేదని, దివ్యారామంలో ఎందుకు వసూలు చేస్తున్నారని సిపిఎం ప్రశ్నిస్తోంది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం పాలకులకు ఇష్టం లేదా? అని మండిపడుతోంది. అటవీ అధికారులు ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోకపోతే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని వాకర్స్ హెచ్చరిస్తున్నారు.

రద్దు చేయిస్తానని ఎంఎల్ఎ హామీ

దివ్యారామంలో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ వాకింగ్, యోగా చేస్తూ, షటిల్ ఆడుకుంటూ ప్రజలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటారని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తుంటారు. కొత్త ఏడాదిలో వాకర్స్ నుంచి ప్రవేశ రుసం రూ.100 వసూలు చేస్తూ, కార్డు పొందనివారు లోనికి అనుమతి లేదని బోర్డు పెట్టారని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు దృష్టికి ప్రజాదర్బార్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి ఎంఎల్ఎ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వాకర్స్ శ్రీధర్, పి.సాయిలక్ష్మి, ఎం.నరేంద్ర, పి.హేమలత, నాగభూషణం, చలపతి, ఆర్కాట్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు ఆపాలి : నాగభూషణం, వాకర్



ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు వాకింగ్‌కు వెళతాను. అయితే డిసెంబర్ 30న ఫారెస్టు అధికారులు వాకింగ్ చేసేవారు రూ.100 చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. డబ్బులు లేవని చెబితే లోనికి అనుమతి లేదని ఖరాఖండిగా చెప్పేశారు. ఇక్కడ డబ్బులు వసూలు చేయడం ప్రారంభిస్తే, మిగిలిన పార్కుల వద్ద ఊరికే ఉండరు. ఈ విధంగా డబ్బు వసూలు చేసుకుంటూ పోతే ఎలా? మా ఆరోగ్యాలు బాగుండటం పాలకులకు ఇష్టం లేదేమో అనిపిస్తోంది. ఫారెస్టు అధికారులు స్పందించి పన్ను వసూళ్లు ఆపి, వాకింగ్ చేసే అందరినీ నగరవనంలోకి అనుమతించాలి. ఇంకొన్నాళ్లు పోతే రోడ్లపై నడిస్తేనూ పన్ను చెల్లించాల్సి వస్తుందేమోనని భయమేస్తోంది.



సావిత్రిబాయ్ పూలే విగ్రహావిష్కరణలో...

సావిత్రి బాయ్ పూలే ఆదర్శ మహిళ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అర్పించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రి బాయ్ పూలే అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నో అవమానాలు, దాడులు ఎదుర్కొని తాను చదువు కోవడమే కాకుండా మహిళల విద్య కోసం టీచర్ గా మారిన ధీశాలి అని కొనియాడారు. మహిళా యూనివర్సిటీ సమీపంలో సావిత్రి బాయ్ పూలే విగ్రహంను శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. బిసి సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయ్ పూలే విగ్రహం ఏర్పాటు చేసుకుని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఆనాటి సమాజంలోని మూఢనమ్మకాలు, దురాచారాలు పోగొట్టేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడిచిన గొప్ప ఆదర్శవాది సావిత్రి బాయ్ పూలే అని కొనియాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు అంటే దానికి మూల కారణం సావిత్రి బాయ్ పూలే ఆలోచనలో కారణమని ఆయన చెప్పారు. కుల వివక్ష, సమాన హక్కుల కోసం పోరాటం చేసిన నాయకురాలు సావిత్రి బాయ్ అని ఆయన చెప్పారు. సావిత్రి బాయ్ పూలే ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీ మోహన్ , ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జిబిసి ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మేయర్ శిరీష, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, బిసి సంఘర్షణ సమితి నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పిఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో...

భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కవయిత్రి, మహిళా విద్యకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకురాలైన సావిత్రిబాయి పూలే విగ్రహానికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డా.జిఎస్.ప్రసాద్, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్ శనివారం ఘనంగా పుష్పాంజలి ఘటించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం రోడ్డులో ప్రజాసంఘాల సభ్యులు నూతనంగా ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం వద్ద పిఆర్ఎస్ఐ సభ్యులు పూలమాలలు వేసి సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకున్నారు.

టిటిడి నిధులతో..

కొండగట్టు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తిరుమల

తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పరిధిలో అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టామని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు తెలిపారు. కొండగట్టులో ఆలయ అభివ ద్ధి పనులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఛైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ కొండగట్టులో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరడంతో ఈ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. టిటిడి బోర్డు సమావేశంలో ఆలయ అభివృద్ధి పనులకు 35.19 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం టిటిడి నిధులతో 96 గదులతో కూడిన ధర్మశాలతో పాటు పలు అభివ ద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు చేరుకోగానే తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికి స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలను అందించారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై శిక్షణ

ప్రజాశక్తి- దొరవారిసత్రం

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం క్యామెల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం యానుదులకు క్లస్టర్ లెవల్ శిక్షణ నిర్వహించారు. భూములు -హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. నెల్లూరు ఐటిడిఎ ఎపిఒ పివి రమణయ్య, తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ బాలాజీ, డిటిడబ్ల్యుఒ ఆఫీసర్ రాజాసోము పాల్గొన్నారు. క్యామెల్ సంస్థ వ్యవస్థాపకులు ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. యానాదులు అభివృద్ధి చెందాలంటే వారిలో అక్షరాస్యతా శాతం పెరగాలని, అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్యామెల్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మల్లిక, వంశీ, లోకేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ ముస్సోరి శిక్షణా కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన, ఫ్లెమింగో ఫెస్టివల్ దృష్ట్యా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తన ముస్సోరిలో ఎంసిటిపి శిక్షణా తరగతులను రద్దు చేసుకుంటున్నట్లు స్వయంగా వెల్లడించారు. ఐఎఎస్ అధికారులకు ఈనెల 5 నుంచి 30వ తేదీ వరకు ఈ శిక్షణ జరగనుంది. జనవరి 10, 11 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లు, నిర్వహణ, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల పర్యటన కారణంగా శిక్షణా తరగతులను రద్దు చేసుకుంటున్నట్లు తెలిపారు.

రూ.10 లక్షల విలువైన వీల్‌చైర్స్ విరాళం

తిరుపతి టౌన్ : ఎల్ఎస్ ఫౌండేషన్ తిరుపతి ఆధ్వర్యంలో పి.లక్ష్మీనారాయణ, శిరీషలు పది వీల్‌చైర్స్‌ను స్విమ్స్ పాత డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వి కుమార్‌కు అందజేశారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. దాత పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కీర్తిశేషులు పొదిలేటి రామక్రిష్ణారెడ్డి, పొదిలేటి లీలావతి జ్ఞాపకార్థం స్విమ్స్ ఆస్పత్రికి పేషంట్ల సహాయార్థం లక్ష ఏడువేల రూపాయల విలువైన పది వీల్‌చైర్స్‌ను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

శెట్టిపల్లి భూముల్లో రైతులతో కలిసి తుడా ఛైర్మన్ పరిశీలన

శెట్టిపల్లి భూములు క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూములను తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి అభివృద్ధి పనులకు ప్రతిపాదించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా తిరుపతి పరిసర ప్రాంతాలను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. భూగర్భ డ్రైనేజీ, విశాలమైన రహదారులు, పచ్చదనానికి పెద్దపీట వేస్తామన్నారు. ఇక్కడ నివసించే ప్రజలకు మెరుగైన ప్రమాణాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. శెట్టిపల్లి ప్రాంత అభివృద్ధి కీలకమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తుడా ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రభుత్వ, తుడా భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అనధికారిక లేఔట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకుముందు అక్కడికి చేరుకున్న తుడా ఛైర్మన్‌ను శెట్టిపల్లి రైతులు, నాయకులు సత్కరించారు.

10న చిత్రలేఖనం పోటీల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఈనెల 10న శనివారం ఉదయం 10 గంటలకు వేమన పద్యం..దాని భావం వ్రాసి అనుగుణమైన బొమ్మ గీసే పోటీలను వేమన జయంతి పురస్కరించుకుని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు. ఈ మేరకు గోడపత్రికను శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. సబ్‌జూనియర్స్ 5, 6, 7 తరగతులు, జూనియర్స్ 8, 9, 10 తరగతులు, సీనియర్స్ ఇంటర్ తత్సమానమైన కోర్సులుగా మూడు గ్రూపులుగా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. వేమన జయంతి 18వ తేదీ బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, పి.గురునాథం, ముఖేష్, నెల్లూరు మునిలక్ష్మి, రత్నశేఖర్, బిర్లానాయుడు, కెఆర్ఎస్ మణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య చెప్పారు. రైతుల భూహక్కులకు సంపూర్ణ భద్రత కల్పించాలనే లక్ష్యంతో 'మీ భూమి..మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి మండలం నర్సింగాపురం గ్రామంలో ఎంఎల్ఎ పులివర్తినాని, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, తిరుపతి ఆర్‌డిఒ రామ్మోహన్‌తో కలిసి పట్టాలను పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఎన్.మౌర్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 23 మండలాలలో 217 గ్రామాల్లో 26,212 మంది రైతులకు రాజముద్రతతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నర్సింగాపురం గ్రామంలో 113 మందికి అందజేశారు. పాసుపుస్తకంలో ఏవైనా తప్పులు ఉంటే రైతులు తిరిగి దరఖాస్తు, రీసర్వేకు పెట్టుకోవచ్చన్నారు.

రైతులకు పట్టా పాసుపుస్తకాలను అందిస్తూ...

పుల్లయ్యను పరామర్శించిన కందారపు మురళి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

సతీ వియోగంతో బాధాతృప్తహృదయంతో ఉన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్యను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి శనివారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. అంగేరి మునెమ్మ ప్రజాతంత్ర ఉద్యమానికి, సిఐటియుకు వెన్నుదన్నుగా ఉన్నారని, 30 ఏళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, పుల్లయ్యకు అండగా నిలిచారని గుర్తు చేశారు. అంగేరి మునెమ్మ లేనిలోటు తీర్చలేనిదన్నారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య శ్రేయోభిలాషులు అర్జున్, లహరి, సిపిఎం శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గంధం మణి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం రవాణా శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుండి మంగళం రోడ్డులో జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయం వరకు శిరస్త్రాణాలను ధరించి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. గరుడ బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు150 మంది కార్యాలయం వరకు హెల్మెట్ ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి హాజరై జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, అతికానాజ్, ఆంజనేయ ప్రసాద్, ప్రసాద్ వర్మ, గరుడ బైక్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయికిరణ్, సెక్రెటరీ ఢిల్లీబాబు పాల్గొన్నారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై జూమ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే-2025 అమలులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి జి.వి.నారాయణ రెడ్డి శనివారం జిల్లాలోని మండల పరిషత్ అభివద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల జిఎస్డబ్ల్యూఎస్, అర్బన్ జిఎస్డబ్ల్యూఎస్ అధికారులతో జూమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా చేరేందుకు ఈ సర్వే అత్యంత కీలకమని అన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు జారీ, అలాగే పీఎం కిసాన్, తల్లికి వందనం వంటి ప్రస్తుత, భవిష్యత్ సంక్షేమ పథకాల అమలుకు ఈ సర్వే ద్వారా సేకరించే డేటానే ఆధారమని స్పష్టం చేశారు. ఈ సర్వే ఫిబ్రవరి 10వ తేదీ వరకు టుంటుందని తెలిపారు.

వైకుంఠ దర్శనం..సామాన్యులకు దూరం..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వైకుంఠ ద్వార దర్శనం ఏకాదశి రోజు క్రమేపీ సామాన్యులకు దూరమవుతుందనే చెప్పాలి.. తిరుమల తిరుపతి దేవస్థానం సంపన్నుల సేవలో తరిస్తూ, ధనికులకే దర్శనం కల్పించేలా వ్యవహరించారు. స్లాబ్లు, డిప్‌ల పేరుతో సామాన్యులను దేవునికి దూరం చేశారు. వైకుంఠ ద్వారాలు పది రోజులు తెరచే ఉంచి, నాలుగో రోజు నుంచి సామాన్యులకు దర్శన సౌకర్యం ఉంటుందని ఎంచక్కా ప్రకటించారు. ఏకాదశి రోజు శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులతో 'ఆహా, ఓహో' అంటూ భజన చేయించారన్న విమర్శలు లేకపోలేదు.

తిరుపతి, తిరుమల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత ప్రాముఖ్యత గలది వైకుంఠ ఏకాదశి దర్శనం. తిరుమల శ్రీవారి ఆలయంలో ఉత్తర ద్వారాలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే తెరుస్తారు. వైకుంఠ ఏకాదశి ద్వాదశి రెండు రోజులు మాత్రమే గతంలో ఆ ద్వారాల్లో ప్రవేశానికి అనుమతించేవారు. ఈ రెండు రోజుల్లో సుమారు మూడు లక్షల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టేవారు. ఈ రద్దీని తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో పది రోజులు పాటు ఉత్తరద్వారాలు తెరిచి ఉండేలా నిర్ణయం చేశారు. ఇందులో స్థానికులకు సైతం ప్రత్యేక అవకాశం కల్పించారు. 2024లో వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీ సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన శ్రీవారి భక్తులకు విస్మయానికి గురిచేసింది.

ఈ ఏడాది స్థానికులకు దర్శనాలను నిలిపివేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారందరూ స్థానికులు ఆన్లైన్ ద్వారా శ్రీవారి దర్శనాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చింది. పైగా డిప్‌లు ఏర్పాటు చేసింది. టీటీడీ నిర్వహించే డిప్పులో ఎవరైతే ఎంపిక అవుతారో వారికే దర్శనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించ్చింది. ఈ నిర్ణయంతో చదువు రాని వారు, ఇంటర్నెట్ అందుబాటులో లేనివారు, గ్రామీణ ప్రాంత వారు దర్శనానికి దూరమయ్యారు. ఎలాగోలా టోకెన్లు సంపాదించుకున్నా, టీటీడీ డిప్లో పేర్లు రాకపోవడంతో అధికమంది దర్శనానికి నోచుకోలేదు. వద్దులు, మహిళలు ఎంతో ఆశతో ఎదురుచూసిన వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ ఏడాది దూరం కావడంతో నిరుత్సాహం చెందారు. పైగా సర్వదర్శనాలు మూడు రోజులు పాటు రద్దు చేశారు. దీంతో దర్శన టోకెన్ ఉంటేనే కొండకి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. భక్తులను టోకన్లతో సంబంధం లేకుండా కొండకు అనుమతిస్తే, స్వామివారి దర్శనం లేకుండా అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టుకొని, స్వామివారికి బయటి నుంచి దండం పెట్టుకొని, సంతప్తి పడే వారమని భక్తులు బాధపడడం గమనార్హం. అనుభవజ్ఞులైన నలుగురు సీనియర్ ఐఎఎస్ అధికారులు, ఇద్దరు ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలోని పరిపాలన విభాగం, సీనియర్ రాజకీయ నాయకులు, ఉద్దండులతో మమేకమైన టిటిడి పాలకమండలి ఉండి కూడా ప్రత్యేక దినాలలో సర్వదర్శనాన్ని కల్పించలేకపోవడం శోచనీయం. పైగా వైకుంఠ ఏకాదశి రోజే సుమారు పది గంటలు పైగా వివిఐపిల సేవలో తరించడం బాధాకరం. డిసెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు శ్రీవారిఉత్తర ద్వారాలు తెరిచి వీఐపీలను దర్శనానికి అనుమతించారు. విఐపిల దర్శనాలే ఉదయం 10.30 వరకు కొనసాగింది అంటే సుమారు 10:30 గంటల పాటు వారి సేవలో టీటీడీ పాలకమండలి తరించింది. టైం స్లాబులు ప్రకారం సామాన్యులను ఉదయం 10 గంటల తర్వాత దర్శనానికి అనుమతించారు. క్యూలైన్లో సెల్ ఫోన్లను భద్రపరిచేందుకే భక్తులకు గంటకు పైగా సమయం పట్టిందంటే, సామాన్యులకు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యం ఎలా ఉందో అర్థమవుతుంది. భక్తుల నియంత్రణ పేరుతో క్యూ లైన్ లలో, స్వామి వారి ఆలయంలో టీటీడీ సిబ్బంది, సేవకులే అధికంగా కనిపించడం గమనార్హం. సాధారణ రోజుల్లోనే 70 నుంచి 80 వేల మందికి దర్శనం కల్పిస్తున్న టీటీడీ, ప్రత్యేక దినాలలో కనీసం 70వేల మందికి కూడా దర్శనం కల్పించకపోవడం విడ్డూరంగా ఉంది. వైకుంఠ ఏకాదశి రోజు 67 వేల మంది, ద్వాదశి రోజు 70 వేల మంది, జనవరి ఒకటవ తేదీ 60 వేల మంది భక్తులకు దర్శనభాగ్యం కల్పించినట్లు సాక్షాత్తు టిటిడి అధికారులు ప్రకటించారు. రోజుకు 90 వేల నుంచి లక్ష మంది వరకు దర్శనాలు కల్పిస్తామని టీటీడీ అధికారులు పాలకమండలి ప్రకటించిన నిర్ణయాలు ఏమయ్యాయో వారి చిత్తశుద్ధికే వదిలేద్దాం. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి ఫస్ట్, మూడు రోజులు తర్వాత వీఐపీల తాకిడి తగ్గడంతో రెండవ తేదీ మాత్రం 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని టీటీడీ నే ప్రకటించింది. అంటే ఆ మూడు రోజులు రోజుకు 30 వేల మందికి పైగా విఐపిల సేవలో తరించామని అంగీకరించినట్టే. తిరుమల చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ప్రత్యేక దినాలలో శ్రీవారి దర్శనానికి సామాన్యులను దూరం చేయడం (సర్వదర్శనం నిలిపివేయడం) ఈ ఏడాది తొలిసారి.

అబ్రార్‌కు అభినందన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యభామా విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ చదువుతున్న ఎస్.ఎం.అబ్రార్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ప్రపంచ ప్రఖ్యాత గుర్తింపు ఉన్న అమెజాన్ సంస్థలో ఏడాదికి రూ.40 లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా ఎంపిక కావడం గర్వకారణమని అప్పుస్మా నాయకులు తెలిపారు. శనివారం అప్పుస్మా రాయల సీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి నాయకత్వంలో అబ్రార్‌ను అప్పుస్మా నాయకులు డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, కే.రాజగోపాల్ రెడ్డి, ఆర్.శ్రీధర్ రెడ్డి, ఎస్.భాస్కర రాజు, బి.రవీంద్ర రెడ్డి, వెంకటరమణ రెడ్డి తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ విజయం అబ్రార్ వ్యక్తిగత సాధనకే కాక, తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనమన్నారు. ఎస్.ఎం.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి అయిన అబ్రార్ సాధించిన ఈ ఘన విజయం పాఠశాలకు గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చిందని పాఠశాల నిర్వహకులు తెలిపారు. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ విద్యే సమాజ అభివృద్ధికి పునాది అని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు కూడా అలవర్చుకోవాలన్నారు. ఇలాంటి విజయాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు.

సిద్ధార్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ కొండూరు అశోక్ రాజు జన్మదినం, రాబోవు సంక్రాంతిని పురస్కరించుకొని శనివారం సంబరాలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినిలు సంప్రదాయ దుస్తులు ధరించి, భోగి మంటలు వేసి, పొంగళ్ళు పెట్టారు. కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గాలిపటాలు, బెలూన్లు అశోక్ రాజు పేరుతో ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్ధన్ రాజు, రమేష్, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసి వేతతో తిప్పలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రైల్వే, రోడ్డు పనుల కోసం గూడూరు రైల్వే జంక్షన్, దక్షిణ రైల్వే గేటు తాత్కాలికంగా మూసి వేశారు. 3 నుండి 9 వ తేదీ వరకు ఈ గేటు మూయనున్నట్లు రైల్వే అధికారుల తెలిపారు. ఈ మార్గంలో ప్రజలు గూడూరు రెండో పట్టణానికి రాక పోకలు సాగిస్తూ ఉండేవారు. ఈ గేటు మూసి వేయడంతో వాహన దారులకు ఏడు రోజుల పాటు అవస్థలు తప్పవని స్థానికులు తెలిపారు. మూడు కిలో మీటర్లు చుట్టూ తిరిగి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుండి వెళ్లాల్సి ఉందన్నారు.

రంగనాథం మృతికి నేదురుమల్లి సంతాపం

ప్రజాశక్తి - వెంకటగిరి: వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ కాసరం రంగనాథం మృతి అత్యంత బాధాకరమని వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి అనుచరుడుగా సుదీర్ఘకాలంగా నేదురుమల్లి కుటుంబంతో అనుబంధం కొనసాగిస్తున్న ఆయన 18 ఏళ్ల పాటు నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడిగా, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. రంగస్థల కళాకారుడుగా, మంచి వక్తగా ఆయనను ఎప్పటికీ మరిచిపోలేమని తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడూరు శాసన సభ్యులు డాక్టర్ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చెన్నూరు గ్రామంలో పర్యటించినప్పుడు పార్టీ కార్యకర్త మల్లి ఈశ్వరయ్య హార్ట్‌ఎటాక్‌తో చనిపోయారు. ఆ సమయంలో ఆయన కుమార్తెను ఎం.సీ.ఏ చదివిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తన మాటను నిలబెట్టుకుంటూ ఎమ్మెల్యే మొదటి, రెండవ సంవత్సరాల ఫీజు 50 వేల రూపాయలు చెల్లించారు. రెండవ సంవత్సరం ఫీజును తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ద్వారా విద్యార్థి మల్లి శ్రావణికి శనివారం అందించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.

జనవాణికి 53 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి 53 వినతులు అందాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వీటిలో కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఇరవై ఒక్క వినతులు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి ఏడు, పెన్షన్‌లకు సంబంధించి ఆరు, కలెక్టరేట్‌కు సంబంధించి ఐదు, కార్పొరేషన్ ప్రణాళిక విభాగానికి సంబంధించి మూడు, టీటీడీకి సంబంధించి మూడు, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌కు సంబంధించి మూడు, విద్యుత్ శాఖకు సంబంధించి రెండు, డి ఎఫ్ ఓ కు సంబంధించి ఒక వినతి వచ్చాయి. దివ్యారామంలో వాకర్స్ నుంచి నెలకు అటవీ శాఖ వంద రూపాయలు వసూలు చేస్తున్నదని దీన్ని తక్షణం నిలిపి వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వినతి పత్రం అందించారు. డిఎఫ్‌ఓతో చర్చించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. తిరుమలలోని తమ అంగడిని ఆరున్నర ఏళ్లుగా బెల్లం రమేష్ ఆక్రమించుకుని వేధిస్తున్నాడని ఎమ్మెల్యే కి వినతి పత్రం అందించింది. ప్రతి నెల మొదటి శనివారం, మూడవ శనివారం ఎన్జీఓ కాలనీలోని తన కార్యాలయంలో జనవాణి నిర్వహించనున్నటుయెమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఆర్ ఓ రవి, డిప్యూటీ తహసిల్దార్ రామచంద్రయ్య, ఎస్పిడిసిఎల్ ఏడి ఆంజనేయులు, సచివాయాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్, పాకాల, చంద్రగిరి, మండలాలకు చెందిన పలువురికి రూ. 41 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొలువర్తి నాని తెలిపారు. శనివారం తిరుపతి రూరల్ మండలంలోని రఘునాథ రిసార్ట్స్‌లో ఉన్న నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, వి.రమేష్ రెడ్డి, లోకాద్రి నాయుడు, కన్నయ్య, యూనిట్ ఇన్చార్జులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు సావిత్రి బాయి పూలే కృషి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సావిత్రి భాయి పూలే ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని, తను చదువుకుని భారత దేశం తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు వాణి పేర్కొన్నారు. శనివారం సావిత్రి భాయి పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో, సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం సావిత్రి బాఎ అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆమె నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయినిలు సుజన, మాధవీలత, రత్నకుమారి, జ్యోతి, హరితల తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పాఠవాలలో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, కార్యక్రమ నిర్వాహకులు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజన, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలో మహిళలకు విద్యనందించిన గొప్ప మానవతావాది సావిత్రిబాయి పూలే అని డాక్టర్ నారాయణ గౌడ్ పేర్కొన్నారు. జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా వర్సిటీ ఎదురుగా సీతమ్మ మార్గంలో కొత్తగా ఆవిష్కరించబడిన సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సావిత్రభాయి పూలే జయంతి సందర్భంగా వడమాలపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. విసి ఆచార్య నరసింగరావు, స్విమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ వనజాక్షమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సీడీసీ ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు పెద్దపీట

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం పిచ్చాటూరు మండలం అప్పబట్టులో అన్నదాతలకు ప్రభుత్వం అందించే నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీ సర్వే ద్వారా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూములను సర్వే చేసి రైతులకు శాశ్వత పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తుందన్నారు. అలాగే సబ్సిడీ విత్తనాలు, గిట్టుబాటు ధరలకు రైతుల నాయకులు నుండి పంట కొనుగోలు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలతో రైతులను ఆదుకుంటుందన్నారు. రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా అప్పబట్టులో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. పాడి రైతులను ఆదుకునేందుకు మినీ గోకులం, పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పిచ్చా టూరు ఆరు నియర్ ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ రవి రెడ్డి, తహశీల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, వెలుగు ఏపీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కటారి జయ జయ రావు ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు పల్లి గ్రామస్తులకు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ విచ్చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములను అధికారులు తారుమారు చేశారని ఆరోపించారు. పట్టాలు పేదల పేరుమీద ఉండడం, సాగులో భూస్వాములు ఉండడం జరుగుతుందన్నారు. కోట మండలంలోని భూముల్లో ట్యాంపరింగ్ చేస్తే నిజాలు తెలుస్తాయన్నారు. దీనంతటికీ గతంలో పనిచేసిన ఎమ్మార్వో ముఖ్య కారణమని తెలియజేశారు. దొంగ పట్టా పుస్తకాలు సృష్టికరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వజ్జవారిపాలెం భూముల విషయాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కోట మండలంలో ఇల్లులేని వారిని గుర్తించి అర్హులైన వారికి నివేశ స్థలాలను, గృహాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, నెల్లూరు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయోభిలాషి ముఖ్యమంత్రి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతిగా, వారి శ్రేయోభిలాషిగా అన్ని విధాల ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం పరిధిలోని మానేరు గ్రామంలో ఏర్పాటుచేసిన "మనభూమి–మన హక్కు" అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్ని, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. భూముల రీ సర్వే చేసిన వారిలో 181లో 132 మంది అన్నదాతలకు రైతుపాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శైలకుమారి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రత్నయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం సాయిబుల పాలెం గ్రామంలో 60 మంది రైతులకు తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, తూపిలి చెరువు జల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు ఎస్కే మస్తాన్ సాహెబ్, జనసేన నాయకుడు చంద్రయ్య, తదితరులు శనివారం రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఏమైనా భూ సమస్యలు ఉంటే అర్జీ రూపంలో సమస్యలను తెలపాలని తహశీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హరిబాబు, కాటమ్మ, వీఆర్ఏలు ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఓజిలి: ఓజిలి మండలం, వెంకటరెడ్డి పాలెం సచివాలయం పరిధిలోని వెంకటరెడ్డి పాలెం, ఆచార్ల పార్లపల్లి గ్రామాల్లో వీఆర్వో వెంకటేశ్వర రాజు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.

భాష్యంలో ఘనంగా 'ఒలంపస్ స్పోర్ట్స్ సాగ'

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భాష్యం ఒలంపస్ స్పోర్ట్స్ సాగ 2025 –26ను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీలో ఉన్న భాష్యం జెడ్ సి ఓ క్యాంపస్లో తిరుపతి జెడ్ సి ఓ ఎల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో తిరుపతి, ఒంగోలు జోనల్ మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ వి యూనివర్సిటీ క్యాంపస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రామయ్య, భాష్యంలో చదువుకున్న ఐ ఈ ఎస్, యు పి ఎస్ సి 14వ ర్యాంకర్ 2010 బ్యాచ్ విద్యార్థి జీ సాయి గౌతమ్ విచ్చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ భాష్యం పాఠశాల విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సాయి గౌతమ్ మాట్లాడుతూ తాను బాష్యంలో చదివినందువలన విద్యకు బలమైన పునాదులు పడ్డాయని తెలిపారు. జడ్ పి పి చిత్తూర్ వెంకటనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడంలో భాష్యం ముందుంటుందని తెలిపారు. ప్రకాశం బ్రాంచ్ జెడ్ ఈవో గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతే తమ లక్ష్యంగా భావిస్తామన్నారు. అనంతరం సీఐ రామయ్య చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి మదనపల్లి ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, తిరుపతి 1 ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జెడ్ సి ఓ ప్రిన్సిపాల్ నేతాజీ,కెటి రోడ్డు బ్రాంచ్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, భాష్యం తిరుపతి హాస్టల్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, జెడ్ సి ఓ బిందు మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కే.గంగా ప్రసాద్ సోదరుడు కె.సత్యనారాయణ చౌదరి శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూళ్లూరుపేట చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు మురళి, ఎస్ఎం సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజ స్వామి ఆలయ గోపురమెక్కి వ్యక్తి హల్చల్

■ మూడు గంటల శ్రమించి కిందికి దించిన విజిలెన్స్ సిబ్బంది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి గోవింద రాజు స్వామి ఆలయం గర్భగుడి గోపురం పైకి ఓ వ్యక్తి మద్యం మత్తులో ఎక్కి హల్చల్ చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అత్యంత పటిష్టమైన నిఘా వ్యవస్థ గల టిటిడి ఆలయంలో చోటు చేసుకున్న ఈ ఘటన నగరవాసులను కలవరపాటుకు గురిచేసింది. స్థానికుల కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా కూర్మ వాడ, పెద్దమల్లా రెడ్డి కాలనీకి చెందిన కుత్తడి తిరుపతి(45) తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. భార్య భర్తలు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ పాప, 8 తరగతి చదువుతున్న బాబు వున్నారు. శుక్రవారం రాత్రి ఆలయ గేట్లు మూసి వేసే సమయంలో, టిటిడి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో భద్రత సిబ్బంది కళ్లుగప్పి తిరుపతి అనే వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించాడు. విజిలెన్స్ సిబ్బంది మేల్కొనే లోపే ఆలయం గోడ దూకి లోపలికి ప్రవేశించి, సింహద్వారం లోపల ఉన్న గోవింద రాజస్వామి ఆలయం గోపురం ఎక్కి కలశాలు లాగే ప్రయత్నం చేశాడు. అక్కడినుంచి గట్టిగా కేకలు వేయడంతో భద్రత సిబ్బంది ఉలిక్కిపడి గోపురం వద్దకు చేరుకున్నారు. అతన్ని కిందికి రావాలని విజిలెన్స్ సిబ్బంది ప్రాధేయపడిన వినలేదు. తనకు 90 ఎం.ఎల్ మద్యం ఇస్తేనే కిందికి దిగుతానని షరతులు పెట్టాడు. అప్రమత్తమైన విజిలెన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రిస్క్ టీం, అగ్నిమాపక సిబ్బంది ఆలయ వద్దకు చేరుకొని, గోపురం చుట్టూ వల కట్టారు. గోపురం పైన ఉన్న వ్యక్తి మద్యం మత్తులో కేకలు వేస్తూ ఎగురుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆలయం వద్ద ఉత్కంఠత నెలకొంది. ఎట్టకేలకు పోలీసులు అతనికి నచ్చజెప్పి మూడు గంటలపాటు శ్రమించి, గోపురం పైనుంచి క్షేమంగా కిందికి దించారు. అతనిని అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కానీ అత్యంత పటిష్ట భద్రత గల టిటిడి ఆలయాల్లో ఇలాంటి ఘటన జరగడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. కనీసం ఈగను కూడా లోపలికి పోనివ్వని విజిలెన్స్ సిబ్బంది ఓ వ్యక్తి మూసి ఉన్న తలుపులు, మూడు గేట్లును దాటుకొని గర్భగుడి గోపురం వద్దకు చేరుకొని, గోపురం పైకి ఎక్కి నిలబడి అరుస్తున్నా గమనించకపోవడం విడ్డూరమని భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిఘా నేత్రాల పర్యవేక్షణ కూడా కొరవడిందనడానికి ఇది ఉదాహరణ అంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి ఆలయం తర్వాత టిటిడి పరిధిలో అతి పెద్ద ఆలయం గోందరాజుస్వామి ఆలయం. తిరుపతి రైల్వే స్టేషన్‌కి ఎదుటే ఆలయం ఉండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అలంటి స్థలంలో ఇలా జరగడం శోచనీయమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా టిటిడి ఉన్నతాధికారులు పాలకమండలి స్పందించి టీటీడీ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ఆలయాల భద్రతపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : ఎంపీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల టీటీడీ అధికారులను వేధించడం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తులపై బురద జల్లడం పరమావధిగా మారిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి విమర్శించారు. టీటీడీ పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని, దీనికి అనేక ప్రత్యక్ష నిదర్శనాలు ఉన్నాయన్నారు. గతంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగిన దురదృష్టకర ఘటనలో కొంతమంది భక్తులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసినప్పటికీ, ఏడాది గడిచినా ఇప్పటివరకు ఆ నివేదిక వెలువడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తిరుమల, తిరుపతిలో వరుసగా భద్రతా లోపాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తమ పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి ఈ భద్రతా లోపాలపై లేఖలు రాశారని, దానికి ప్రతిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, మా లేఖకు వివరణ ఇవ్వాలని ఆదేశించినప్పటికి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఆలయాల భద్రతపై ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనమని ఎంపీ స్పష్టం చేశారు. ఆలయాల పరిపాలనను పూర్తిగా గాలికి వదిలేయడం వల్లనే నిన్న అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి గోవిందరాజ స్వామి ఆలయంలోని నడిమి గోపురం ఎక్కి, పవిత్రమైన కలశాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం, నకిలీ మద్యం విక్రయాలు జరగడం వల్ల ప్రజలు తాగి ఏం చేస్తున్నారో వారికే అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు కారణమైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే పటిష్ట చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తిరుపతి ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు.

పుదూరులో ఎన్ఎస్ఎస్ క్యాంప్

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని శ్రీ వేమ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నాయుడుపేట మండలం, పుదూరులో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. శ్రీ వేమ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ద్వారా పుదూరు పంచాయతీలోని కుప్పరగుంట గ్రామంలో జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపులో 50 మంది విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక క్యాంపు జనవరి 2వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు జరుగుతుందని కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి తెలిపారు. ఏడు రోజులు కుప్పరగుంట పాఠశాల, పరిసరాలను శుభ్రం చేయడం, మొక్కలు నాటుటడం, వైద్య సదుపాయం కల్పించడం, ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు (శనివారం) ఎన్.ఎస్.ఎస్.పి.ఓ.బి నరేంద్ర ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రామంలో క్లోరినేషన్ చేయించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్‌ను శ్రీ వేమ డిగ్రీ కళాశాల యాజమాన్యం వారు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక క్యాంపులో వేమా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రంజిత్ రెడ్డి అధ్యాపకులు సురేంద్ర, జితేంద్ర, సన్నిలు పాల్గొన్నారు.

పశువుల కొట్టమా?.. ప్రభుత్వ భవనమా?

■ ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనుల్లో కదలిక శూన్యం ■ రంగంపేటలో నిలిచిన ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణ పనులు

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, ఎ రంగంపేట నుండి నారావారిపల్లెకు వెళ్ల ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం ఎనిమిదేళ్లకు పైగా అసంపూర్తిగా ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో కొందరు ఈ భవనాన్ని పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, తల్లితండ్రులు భయాందోళన చెందారు. 10 సంవత్సరాల ముందు ఈ భవనంలోనే చదువుకొన్న విద్యార్థులు అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్నారని, ఈ భవనానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని గ్రామస్తులు తెలియజేసారు. ఈ భవనం ప్రస్తుతం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటోందని వాపోయారు. దీంతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నూతన పాఠశాల భవనం మంజూరైంది. భవనం నిర్మాణం చేపట్టారు. మరోపక్క శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనానికి కూడా మరమ్మతులు చేపట్టారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నిర్మాణంలో ఉన్న భవనానికి నిధులు మంజూరు చేయలేదు. సంబంధిత అధికారులూ గాలికొదిలేశారు. అప్పటి నుంచి భవన నిర్మాణ పనుల్లో కదలిక లేదు. అధికారులు చొరవ తీసుకుని నిర్మాణ పనులు చేపట్టి, వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యంఈవో వివరణ..

మండల విద్యాశాఖధికారిణి లలిత కుమారిని వివరణ కోరగా మాకు ఇంతవరకు ప్రభుత్వ పాఠశాల భవనం అని తెలియదని, పూర్తి వివరాలు విచారణ చేసి, అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయించి పాఠశాల పరిధిలోకి తీసుకుంటామని తెలియజేసారు.

పాఠశాలలో పశువులు

క్రైం న్యూస్

ఇద్దరు దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, నారాయణపురం ప్రాంతంలో రాత్రి వేళ ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న ఇద్దరు దొంగలను తిరుపతి సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషన్లో శనివారం డీఎస్పీ శ్యాంసుందర్ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ బి.నాగభూషణరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇళ్ల చోరీలపై దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం బెంగళూరుకి చెందిన తండ్రి కొడుకులు పెరుమాళ్ కృష్ణ (54), సంతోష్ కుమార్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. గత 15 సంవత్సరాలుగా తిరుపతిలో నివాసం ఉంటూ, పెరుమాళ్ కృష్ణ కర్ణాటక రాష్ట్రంలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అతని కుమారుడు సంతోష్ కుమార్ కూడా తన తండ్రితో కలిసి 2025 జనవరి నుండి తిరుపతి పట్టణంలోని సుభాష్ నగర్, సుబ్బారెడ్డి నగర్, నారాయణపురం ప్రాంతాల్లో ఇళ్ల దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులు అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ.18.30 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించమన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన టాక్టర్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, అరిగెల కండ్రిగ గ్రామానికి సమీపంలో శనివారం సాయంకాలం బుచ్చినాయుడు కండ్రిక గ్రామానికి చెందిన ట్రాక్టర్ శ్రీకాళహస్తి నుండి బుచ్చినాయుడు కండ్రిగ వైపు మెటల్ లోడుతో వెళుతుండగా అరిగెల కండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే గొర్రెల కాపరి తన గొర్రెల మందను రోడ్డు దాటిస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ వేగంగా వస్తున్న సమయంలో అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మూడు గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. గొర్రెలు కాపరి సుబ్రహ్మణ్యం జీవనధారామైన గొర్రెలు చనిపోవడంతో ఆవేదన వ్యక్తపరిచాడు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ ముఖ ద్వారం మలుపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గూడూరు నుంచి వెంకటగిరి వైపు వెళ్తున్న వ్యాన్ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు, గుర్త తెలియని వ్యక్తి రోడ్డు దాటే ప్రయత్నంలో, వాహనం ఢీకొట్టి స్పృహ తప్పి పడిపోయాడని తెలిపారు. చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా హాస్పిటల్ నుండి నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించడం జరిగినదన్నారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలిసినవారు గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సేంద్రియ ఎరువులు వాడండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రబీ పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే, రసాయనిక ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులు విరివిగా వాడాలని పుత్తూరు మండల వ్యవసాయ అధికారి కోదండయ్య సూచించారు. శనివారం రూరల్ మండలం తొర్రూరు పంచాయతీలో జిల్లా వానరుల కేంద్రం, తిరుపతి వారు ప్రధాన మంత్రి కృషి వికాస్ యోజన క్రింద ముందస్తు అభ్యాసనా గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం, తిరుపతి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతు వ్యవసాయ పంటలలో అధిక నాణ్యమైన దిగుబడులు సాదించాలంటే సమతుల ఎరువుల యజమాన్యం, మేలైన యజమాన్య పద్దతులను పాటించాలన్నారు. అనంతరం సేంద్రియ ఉత్పతులు, ప్రభావవంతమైన రసాయాలను తయారు చేసుకోనే పద్దతులను తెలియజేశారు.

సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్ష కోచింగ్‌లో అగ్రగామి 'విశ్వం'

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో 18 జనవరి 2026న జరగనున్న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2026కు సంబంధించిన మాక్ టెస్ట్ బుక్లెట్‌ను ఎం.ఎల్.సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సైనిక్ స్కూల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు మొత్తం 63 సీట్లు, అలాగే నవోదయ ఫలితాల్లో 61 సీట్లు సాధించి విశ్వం విద్యా సంస్థలు విజయ భేరి మోగించా యని తెలిపారు. విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన స్టడీ మెటీరియల్ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీ పరీక్షలకు సంబంధించిన మరింత సమాచారం కోసం 86888 88802 మరియు 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE TIRUPATI
I.A.No. 553/2024, A.S.No. /2024

Malepati Kesavulu Naidu ..Petitioner/Appellant
V/s
1) S. Parveen, 2) S.M. Basha
...Respondents/Respondents

NOTICE TO THE RESPONDENTS No. 1 & 2

R1) S.Gousiya Parveen W/o S.M. Basha
R2) S.M. Basha, S/o Shaik Pyaryja.
Both are D.No. 3-121, Vykuntapuram, Muthyalareddipalle, Tirupati Urban Mandal, Tirupati District.

Please take notice that the above Petition/Appeal filed by the petitioner/Appellant against to you seeking the relief to condone the delay in filing the above appeal and the said Petition/Appeal has been posted to 08-01-2026 for your appearance. So, you are hereby called upon you to appear in person or through advocate before the above said court on 08-01-2026 at about 10-30 a.m.. Failing which, the matter will be decided expartee.

Hearing date: 08-01-2026

R. MADHUSUDHAY RAO
Advocate for Petitioner/Appellant, Tirupati

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GUDUR.
IA NO 156/2025
OS NO 117/2014.

Between
Saka Narayana (Died) and others
.....petitioners / plaintiffs.
Vs
1. Saka Rajasekhar and others
....Respondents / Defendents.

Notice

To,
R2, Bandarapu Meenakshi,
W/o Mallikarjuna,
R/o 15/169-4-1A, Ranipeta,
Gudur Town, Gudur Mandal,
Tirupathi District.

పై నెంబరున పిటీష్నర్లు పైన తెలిపిన కోర్టులో మీ వగైరాలపై పార్టీషియన్ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 2 వ రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది॥ 23-01-2026** న వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

యస్.రాగదీపిక, బి.కామ్, ఎల్.ఎల్.బి
పిటీష్నర్లు తరుపున అడ్వకేట్,
నెల్లూరు.

పకృతి సంరక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పకృతిని కాపాడితే మానవ మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్సి రాఘవేంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర సేవాధికారి సంస్థ ఆదేశాలు మేరకు, పుత్తూరు కోర్టు ఆవరణలో, మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ న్యాయం అంశంపై, జరిగిన సదస్సులో, జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాలి కాలుష్యం, నీటి కాలుష్యాలు, శబ్ద కాలుష్యాలు, భూమి కాలుష్యాలను అరికట్టాలన్నారు. ఈ సదస్సులో ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్, కోర్టు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టాన్ని మరువం : ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) తెలుగుదేశం పార్టీ విజయానికి కష్టపడిన కార్యకర్తలకు, నాయకులను పార్టీ ఎప్పటికీ మరిచిపోదని, ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం, నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కష్టపడిన కార్యకర్తలను గుర్తించి ఉత్తమ కార్యకర్తలు, నాయకులగా ప్రశంసా పత్రాలను అందజేశారు. రామచంద్రపురం మండలం నుండి ధనంజయులు, వెంకటేష్ రెడ్డి లకు ఉత్తమ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆరి లీల మోహన్ నాయుడు, మాజీ ఎంపీపీ తానికొండ కేశవుల నాయుడు, కార్యదర్శి రావిళ్ళ గిరినాయుడు, శ్రావణ కుమార్, కే సోమశేఖర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞానమనే చీకటిని తొలగించే వాడే గురువు

ప్రజాశక్తి - క్యాంపస్ :అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టేవాడే గురువని యోగదా సత్సంగ సొసైటీ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద చెప్పారు. భగవంతుడి నిశ్శబ్ద స్వరమే గురువన్నారు. వై ఎస్ ఎస్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి నలందా నగర్‌లో నూతన ధ్యాన మందిరాన్ని స్వామి స్మరణానంద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పుత్త రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సి ఆర్ ఎం టీచర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఏర్పేడు :ఏర్పేడు మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖధికారులు డి.ప్రేమలత, దయాకర్ జిల్లా సిఆర్‌ఎం టీచర్స్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎం టీచర్స్ ఏ. వెంకట్ ముని, మునీశ్వర్, సురేష్ బాబు, గురు ప్రసాద్, మురళి, ఎంఆర్సి ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురువారెడ్డిని కలిసిన గ్రంధాలయాధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఇటీవలే ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా నియమితులైన గురువారెడ్డిని శ్రీకాళహస్తిలో శనివారం గ్రంథాలయ శాఖాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. విశ్రాంత గ్రంథాలయం ఉద్యోగులు ఆర్ .లలిత, మునిరాజ గ్రంథాలయాధికారులు ధనంజయులు, లావణ్య, వసంత కుమారి, గజంద్రబాబు పూర్ణిమ, తులసికుమార్, సరస్వతి, జూనియర్ అసిస్టెంట్ మునీంద్ర ,తొట్టంబేడు గ్రంథాలయాధికారి హరిక్రిష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొనారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎంఈఓ దారా మస్తానయ్య ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మండలంలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయినీలను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోట తాసిల్దార్ కటారి జయజయ రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయకులు హాజరయ్యారు. ముందుగా సావిత్రిబాలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. జి.పుష్పావతి ఎస్జీటీ వీరారెడ్డి సత్రం,బి శశికళ ఎస్జిటి ఊనుగుంటపాలెం,ఏ ఎస్ పురం స్కూల్ ఎస్ జి టి సిహెచ్.మంజరిలను ఎంపిక చేసి తహశీల్దార్, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, ఎమ్ ఈ ఓ దారా.మస్తానయ్యలు సత్కరించి అభినందనలు తెలియజేశారు. డిసెంబర్ 31న రిటైర్ అయిన కే. ప్రమీల ఉపాధ్యాయురాలిని సన్మానించారు.

ఆలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు అందించాలి : టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టిటిడి స్థానిక, అనుబంధ ఆలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు అందించేందుకు వర్చువల్ రియాలిటీ సహకారం తీసుకోవాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులకు సూచించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టిటిడి ఉన్నతాధికారులతో శనివారం టిటిడి ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, టిటిడి స్థానిక, అనుబంధ ఆలయాల ప్రాశస్త్యం, శిల్ప సౌందర్యం తదితర ప్రధాన అంశాలను భక్తులకు చేరవేసేందుకు అవసరమైతే ఆగుమెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ సాయం తీసుకుని, ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఆలయాల శిల్పాలు, చిత్రాలను భక్తులు సెల్ ఫోన్‌తో స్కాన్ చేసినట్లు అయితే సంబంధిత పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా నూతన టెక్నాలజీతో అనుసంధానం చేయాలని సూచించారు. అదేవిధంగా, తిరుమల శ్రీవారి ఆలయం కైంకర్యాలను ఎస్వీబీసీ ఛానల్‌లో అందిస్తున్న తరహాలో టిటిడి స్థానిక ఆలయాలు, అనుబంద ఆలయాల విశిష్టతను భక్తులకు అందించేందుకు అవసరమైతే ఎస్వీబీసీ ఆధ్వర్యంలో మరో ఛానల్ తీసుకువచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. టిటిడి ఆలయాలల్లో అన్నదానం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీకృష్ణ, ఎఫ్ఏఅండ్ సిఏఓ బాలాజీ, సీఈ టివి సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీలో యోగా చికిత్స

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఫిజియోథెరపీలో యోగా చికిత్స అనేది అత్యుత్తమైన కలయికని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ తెలిపారు. స్విమ్స్ కాలేజీ అఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని శనివారం స్విమ్స్ ఓ.పి.డి. బ్లాక్ లోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ శ్వాస నియంత్రణ ద్వారా శరీరాన్ని సమతుల్యం చేసకోవచ్చునని పేర్కొన్నారు. తమిళనాడు కోయంబత్తూరు అమృతదర్శనం, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ స్పిర్చువల్ స్టడీస్ (ఐ.సి.ఎస్.ఎస్) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమరావతి మాట్లాడుతూ ఫిజియోథెరపీ నొప్పి తగ్గించడంలో సహాయపడుతుందని, యోగా శరీర అవగాహన (బాడీ అవేర్నెస్) పెంచి, నొప్పి సహనాన్ని మెరుగుపరుస్తుందని తెలియజేశారు. కాలేజి ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మాధవి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, శారీరక దృఢత్వం పొందాలంటే యోగా/మెడిటేషన్ వంటివి అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బయోఇన్ఫర్మాటిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఉమమాహేశ్వరి, ఫిజియోథెరపి కాలేజి అసోసియేట్ ప్రొ డాక్టర్ శ్రీకుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌కు తృతీయ స్థానం

ప్రజాశక్తి - క్యాంపస్ :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ మోహన్ కందా నేతృత్వంలోని వారధి ఇండియా ఫౌండేషన్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలలో తిరుపతి జిల్లాకు చెందిన ఎస్వియు క్యాంపస్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించి 27000 రూపాయలు పారితోషకం అందుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాపిక (9వ తరగతి) ధనుష్ కృష్ణ (8వ తరగతి), గగన్ కృష్ణ (8వ తరగతి), వీరి గైడ్ టీచర్ కే.రాధమ్మను, ప్రధాన ఉపాధ్యాయురాలు శకీనమ్మనూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తాతా నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సిడిసి డీన్ చెన్నాయుడులు అభినందించారు.

కాకాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర మాజీ మంత్రి, వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాకాణి గోవర్ధన్ రెడ్డిని కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా కాకాణి గోవర్ధన్ రెడ్డికి కిలివేటి సంజీవయ్య శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, కౌన్సిలర్ సరిత, వైసిపి నాయకులు ప్రతాపరెడ్డి, సురేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీవారి భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ

ప్రజాశక్తి - చంద్రగిరి : వైకుంఠ ఏకాదశి పర్వదిన రోజుల సందర్భంగా చిన్నరామాపురం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్.ఆర్. మూర్తి, శ్రీనివాస మంగాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజా రాయల్ శనివారం శ్రీనివాస మంగాపురంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

మహిళ వర్సిటీలో బోధనా సిబ్బందికి పదోన్నతులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద 23 మంది పర్మనెంట్ బోధనా సిబ్బందికి పదోన్నతులు మంజూరు చేయటం జరిగింది. ఈ పదోన్నతి ఉత్తర్వులను వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ వి. ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని జారీ చేయగా, ఇటీవల నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ పదోన్నతులు స్టేజ్ 1 నుంచి స్టేజ్ 2, స్టేజ్ 2 నుంచి స్టేజ్ 3, స్టేజ్ 3 నుంచి స్టేజ్ 4, స్టేజ్ 4 నుంచి స్టేజ్ 5 వరకు వర్తిస్తాయి. యూజీసీ నిబంధనలు, విశ్వవిద్యాలయ నియమావళి ప్రకారం, బోధన, పరిశోధన, విద్యా సేవలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బోధనా సిబ్బందికి ఈ పదోన్నతులు కల్పించబడ్డాయి. ఈ సందర్భంగా వైస్ చాన్సులర్, రిజిస్ట్రార్ పదోన్నతి పొందిన బోధనా సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ నర్సరీ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు, హోమ్ సైన్స్ విభాగం ప్రతిష్ఠాత్మక నిర్వహిస్తున్న ఎస్వీయూ లేబొరేటరీ నర్సింగ్ స్కూల్ వార్షికోత్సవం శనివారం రోజు స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉపకులపతి ఆచార్య నర్సింగరావు మాట్లాడుతూ ఇలాంటి ఆదర్శవంతమైన పాఠశాలలు అరుదుగా వుంటాయని, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆచార్య అనురాధ మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి హోదాలలో వున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, కన్వీనర్ డాక్టర్ స్వరూపరాణి, ఆచార్య సుచరిత తదితరులు పాల్గొన్నారు.

మా ఆలయం రూపు రేఖలు మార్చొద్దు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయానికి ఆగ్రామస్తులు రూపు రేఖలు మారుస్తున్నారని సింగ్ కులస్తులు ఆలయ ట్రస్ట్– శత్రుసింగ్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సింగ్ కులస్తులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారు తమ కులదైవం అని తరతరాలుగా పూజిస్తున్నామన్నారు. అయితే తమ ఆధీనంలోని ఆలయానికి శ్రీనివాసమంగాపురం గ్రామస్తులు ఆలయం తమదే అంటూ ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, హుండీ మార్చడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు.

సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభకు తరలిరండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభ జనవరి 18వ తేదీ నా ఖమ్మం నగరంలో జరుగనుంది. ఈ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు సిపిఐ 101 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా తిరుపతి మూడవ డివిజన్లోని లెనిన్ నగర్‌లో శాఖ కార్యదర్శి యం ఆర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిపిఐ ఎర్రజెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య నగర కార్యదర్శి జే విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచించారు. గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపం వద్ద 37వ రహదారి భద్రతా మా సొత్సవాలను ఆర్టీవో అధికారులతో కలిసి ప్రారంభించారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, ప్రాణనష్టం సంభవించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్టీవో బి.ఎస్.కె.కిషోర్, ఆర్టీవో కార్యాలయం ఏవో రాజశేఖర్, టీడీపీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వాటంబేడు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఏ. ఎం.వి. ఐ ప్రభాకర్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణం, నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ, పోటుపాలెం కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేసి, పత్రాలు సరిగా లేని వాహనదారులకుఅపరాధ రుసుమును విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలు, హెల్మెట్ ధరించని 15 మంది వాహన దారులకు 87 వేల రూపాయల అపరాధ రుసుమును విధించి, కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అనంతరం వాహన దారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈయన వెంట ఆర్టీవో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వన్నెరెడ్లు ఐక్యత సాధించాలి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని వన్నెరెడ్లు ఐక్యత సాధించాలని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. పొన్నాలమ్మ గుడి వద్ద వన్నెరెడ్ల సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారు గరుడ వాహనంతో ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్కుమార్, రమేష్కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు దనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్ధసారిది, జమేధర్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.